ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి



జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని జలమండలి ఎండీ అశోక్‌కుమార్‌రెడ్డికి కార్పొరేటర్ శ్రవణ్ వినతి పత్రం అందజేశారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో యూజీడీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. తాగునీటి సరఫరాలో లో ప్రెషర్ సమస్య ఉందని చెప్పామన్నారు. సఫిల్‌గూడలోని ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరామన్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎండీ హామీ ఇచ్చారన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహానికి భూమిపూజ

ఉప్పల్: ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం అవరణలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుకు మంగళవారం మాజీ ఎంపీ వి. హనుమంత రావు, రాష్ట్ర క్రీడాసాధికార సంస్థ చైర్మన్ కొత్త శివసేనారెడ్డి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డిలతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ జయంతి ఆగస్టు 20న ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు. 23 అడుగుల ఎత్తు, 1000 కిలోలతో క్యాంస విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రముఖ ఆర్టిస్ట్ ఓడియార్ చేతుల మీదుగా ఈ విగ్రహం రూపుదిద్దుకుంటుందన్నారు. జ్ఞానేశ్వర్‌గౌడ్, లక్ష్మణ్‌కుమార్‌యాదవ్, సద్గురు, శంబుల్లా శ్రీకాంత్, అవినాష్, సుధాకర్‌రెడ్డి, రఘుపతి రెడ్డి, రఫిక్, లింగంపల్లి రామకృష్ణ, లూకాస్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ టు జవహర్‌నగర్



మేడ్చల్‌లోని డంపింగ్ యార్డు

మేడ్చల్ పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండటం, శివారు ప్రాంతాల్లోని కాలనీలు వెలియడం, డంపింగ్ యార్డుల నిర్వహణ భారం అధికం కావడంతో నగరానికి చెత్త అడ్డాగా ఉన్న నియోజకవర్గంలోని జహర్‌నగర్‌కు డంపింగ్ యార్డుకు మేడ్చల్ మున్సిపాలిటీ చెత్తను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారుల ఏర్పాట్లు సఫలీకృతమైతే మేడ్చల్ డంపింగ్ యార్డులు లేని పట్టణంగా మారుతుంది. డంపింగ్ యార్డులతో ఉన్న సమస్యలు శాశ్వతంగా తీరుతాయి.

- సఫలమైతే డంపింగ్ యార్డు లేని పట్టణంగా..
- ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ అధికారులు

మేడ్చల్ : పట్టణంలో నిత్యం టన్నుల కొద్ది చెత్తను మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్నారు. అత్వెల్లి పరిధిలోని జయదర్శిణి సమీపంలోని ప్రభుత్వ భూముల్లో డంపింగ్ ఏర్పాటు చేసి వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. రైల్వేస్టేషన్ అవతల ప్రాంతంలో మరో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి అక్కడ చెత్త వేస్తున్నారు. ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తూ.. డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో ఆటోలు, ట్రాక్టర్లు పెట్టి చెత్తను సేకరిస్తున్నారు.

పంట పొలాలు ఉండటంతో..

అత్వెల్లి డంపింగ్ యార్డు సమీపంలో పంటపొలాలు ఉండటంతో పంటలు దెబ్బ తింటున్నాయి. ఈ డంపింగ్ యార్డుకు వెళ్లేందుకు ప్రైవేటు భూముల నుంచి వెళ్లాల్సి వస్తోంది. భూయజమానులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో తరలించడం ప్రధాన సమస్యగా మారింది.

మరోవైపు రైల్వేస్టేషన్ సమీపంలో..

రైల్వేస్టేషన్ సమీపంలో డంపింగ్ యార్డు ఉండటంతో మూడు నాలుగు కాలనీల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న డంపింగ్ యార్డులో ఆధునిక వసతులు ఉన్నా.. అన్ని వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోవడంతో రైల్వేట్రాక్ అవతలి వైపు ఉన్న కాలనీల చెత్త మాత్రమే అక్కడకు వెళ్తోంది. దీనివల్ల పెద్దగా ప్రయోజనం లేకుండా పోతుంది.

అడిషనల్ కలెక్టర్ సూచనతో...

జిల్లా అడిషనల్ కలెక్టర్ మున్సిపాలిటీలో పర్యటించి డంపింగ్ యార్డులను పరిశీలించడంతో సమస్య బయటపడింది. చెత్తను రిసైక్లింగ్ చేయడం లేదని, అన్ని వసతులున్నా.. ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి సమస్యను వివరించగా.. వ్యర్థాలను జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు.



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం

అనుమతిచ్చిన జీహెచ్ఎంసీ..

మేడ్చల్ మున్సిపాలిటీ నుంచి వచ్చే చెత్తను జవహర్ నగర్ డంపింగ్ యార్డులో డంప్ చేసేందుకు హైదరాబాద్ నగర పాలక సంస్థ అనుమతినిచ్చింది. రవాణా మాత్రం మేడ్చల్ మున్సిపాలిటీ భరించాలని, వాహనాలు తాము ఏర్పాటు చేయలేమని కండిషన్ పెట్టింది.

- మేడ్చల్ మున్సిపల్ అధికారులు చెత్త తరలింపు కోసం జిల్లా, జీహెచ్ఎంసీ అధికారుల అనుమతులు తీసుకున్నారు.

ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ అధికారులు..

జాతీయ రహదారికి సమీపంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి భారీ వాహనాల్లో జవహర్‌నగర్‌కు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు కౌన్సిల్ అమోదం పొందారు. అత్వెల్లి, కిష్టాపూర్, కండ్లకోయ, చెక్‌పోస్ట్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని సేకరించి, మేడ్చల్ నుంచి వచ్చే చెత్తను ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా తరలించి అక్కడ నుండి లారీల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రణాళికలు పూర్తయితే మేడ్చల్‌లో పూర్తిగా డంపింగ్ యార్డు సమస్య తీరుతుంది.

త్వరలోనే తరలిస్తాం..



మేడ్చల్ నుంచి వచ్చే చెత్తను పూర్తిగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు త్వరలోనే తరలిస్తాం. జీహెచ్ఎంసీ, జిల్లా అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నాం. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం చెత్తను ఒకే చోటుకు చేర్చి డంపింగ్ యార్డుకు తరలిస్తాం. త్వరలోనే డంపింగ్ యార్డులేని మున్సిపాలిటీగా మేడ్చల్ మారనుంది.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

సామాజిక అంశాలపై విద్యార్థులకు 'శిక్ష సప్తాహ్'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అల్వాల్ : అల్వాల్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 'శిక్ష సప్తహ్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గత ఏడు రోజులుగా ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు, సామాజిక కార్యకర్తలను భాగస్వాములను చేసి విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలుర పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అతిథి భోజనాలు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు రమాదేవి, మెహర్‌పల్లి, లక్ష్మణ్, సంగీత, వెంకట్‌రాజ్, కృష్ణపాల్, మురళీమోహన్, మాధవి, రామకృష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో స్వర్ణం



పవిత్రను సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకులు



పతకాలతో డోలి పవిత్ర

అల్వాల్ : వెంకటాపురంలోని మహాబోధి విద్యాలయ పాఠశాల పీఈటీగా విధులు నిర్వహిస్తున్న డోలి పవిత్ర దక్షిణ కొరియాలో జరిగిన తైక్వాండో పోటీల్లో పాల్గొని అండర్– 39 విభాగంలో మొదటి స్థానం కైవసం చేసుకుని స్వర్ణం, మహిళల విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీల్లో మొత్తం 27 దేశాలు పాల్గొనగా.. భారతదేశం తరుపున ప్రాతినిధ్యం వహించిన డోలి పవిత్ర రెండు పతకాలు గెలుపొందారు. ఈ పోటీలు దక్షిణ కొరియాలో జూలై 18 నుంచి 23 వరకు జరిగాయి. మంగళవారం పవిత్రను ప్రిన్సిపాల్ భవాని, ఇతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. పతకాల విజేత డోలి పవిత్ర మాట్లాడుతూ.. ఈ విజయానికి తోడ్పాటును అందించిన పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వెన్నెల గద్దర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోచ్ మాస్టర్ నాగూర్‌బాబుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు. పాఠశాల పరిపాలనాధికారి రాము, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు తగిన చర్యలు



జలమండలి అధికారులతో మేయర్ తోటకూర అజయ్

బోడుప్పల్: చెరువుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. కమిషనర్ రామలింగం, ఇరిగేషన్ ఏఈ పరమేశ్‌తో కలిసి మంగళవారం చెంగిచర్లలో చింతలకుంట చెరువు, బోడుప్పల్‌లో అల్మాస్‌కుంట చెరువులను ఆయన పరిశీలించారు. చెరువుల విస్తీర్ణం, కబ్జాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ అజయ్‌యాదవ్ మాట్లాడుతూ.. చెరువుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్, చెరువులను కబ్జాచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా చెరువుల పరిరక్షణకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, పులకండ్ల జంగారెడ్డి, కుర్రి శివశంకర్, కొత్త విక్రమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను పెంచాలని..

బోడుప్పల్ నగర కార్పొరేషన్ ప్రజలకు అవసరమైన తాగునీటి సరఫరాను పెంచాలని కోరుతూ.. బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం జలమండలి కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డి, జీఎం అమరేందర్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా నీటిసరఫరా చేయాలని కోరామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.

పరామర్శ

గౌతంనగర్: దుర్గా భవానీ రజకసంఘం సభ్యులు కొలనుపాక ఆంజనేయులు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మంగళవారం ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శించి వారికి నిత్యావసర సరుకులు అందజేశారు. సంఘం అధ్యక్షులు శంకర్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, సెక్రటరీ యాదగిరి, కోశాధికారి సతీష్, తిరుపతి, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

సినారెకు నివాళి



మల్కాజిగిరి : అక్షర కౌముది సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కంజ జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సినారె జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆన్‌లైన్ ద్వారా కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరం శంకరం, ఉదయ సాహితి జంట నగరాల శాఖ అధ్యక్షుడు తులసీరమణాచార్యులు, దాస్యం లక్ష్మయ్య, సేనాధిపతి, వెంకటకృష్ణ మాధవి పాల్గొన్నారు.

ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలి

కీసర: పంటరుణాలు తీసుకున్న రైతులకు శరతులు లేకుండా రుణమాఫీ పథకం వర్తింపజేయాలని మేడ్చల్‌జిల్లా బీజేపీ నేత కొంపల్లి చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత రుణమాఫీపై కొర్రీలు పెట్టడం సరికాదన్నారు

ఓల్డ్ మల్లాపూర్‌లో డీజీఎం పర్యటన



సాక్షిలో ప్రచురితమైన వార్త

సాక్షి ఎఫెక్ట్..



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న డీజీఎం సతీష్

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్ నుంచి నోమాకు వెళ్లే దారిలో నిత్యం డ్రైనేజీతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని మంగళవారం 'సాక్షి' లో 'పొంగుతున్న డ్రైనేజీ' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి డీజీఎం సతీష్ ఓల్డ్ మల్లాపూర్‌లో పర్యటించి డ్రైనేజీలైన్‌ను పరిశీలించారు. ఎగువ ఉన్నా అపార్ట్‌మెంట్ల డ్రైనేజీ లైన్‌ను ఇటీవల ఓల్డ్ మల్లాపూర్ లైన్‌కు కలపడంతో ఈ సమస్య రోజురోజుకి తీవ్రమవుతుందని స్థానికులు డీజీఎంతో చెప్పారు. డ్రైనేజీని మరొక లైన్‌కి కలిపితే సమస్య ఉండదని వివరించారు. రౌండ్ మ్యాన్‌హోల్స్‌ను ఏర్పాటు చేస్తే మట్టి మ్యాన్‌హోళ్లలో చేరదన్నారు. డ్రైనేజీ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని డీజీఎం హామీ ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేసుకుంటున్న గంప నాగేశ్వరరావు

గౌతంనగర్: పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మనోహర్‌రెడ్డి, ప్రముఖ సైకాలజిస్ట్, గంప నాగేశ్వరరావులు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ యాప్రాల్ మాతృశక్తి ఆధ్వర్యంలో యమునా పాఠక్ నేతృత్వంలో మంగళవారం బిహారి బస్తీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ స్త్రీ, వైద్య నిపుణులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ వంశీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిల సంయుక్తాధ్వర్యంలో సుమారు 120 మందికి షుగర్, బీపీ, దంత పరీక్షలతో పాటు మహిళలకు గైనిక్ పరీక్షలు నిర్వహించిన అనంతరం అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు విశ్వేశ్వరావు, బొప్ప అధ్యక్షులు సుశీల్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ తెలంగాణ ప్రభుత్వం, డాక్టర్ సుధాకర్, వింజయూరి, రవి, రాఘవేంద్రరావు, విజయలక్ష్మి, భవాని, కాంతారావు, శంకర్, హరిహర సుబ్రహ్మణ్యం, అశోక్‌స్వేన్, పవన్, వెంకట్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ సిబ్బందికి వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

పీర్జాదిగూడలో..

మేడిపల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్ – 2024లో భాగంగా 'సఫాయి ఆప్నావో, భీమారి భగావో' కార్యక్రమంలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్మికులకు మంగళవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కార్మికులకు రక్తపరీక్షలు, బీపీ, మధుమేహం, థైరాయిడ్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం మేయర్ జక్క వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటిలోపల, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని మేయర్ ఈ సందర్భంగా వివరించారు. కార్పొరేటర్ కొల్తూరి మహేష్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ మురళి, డాక్టర్ ప్రతిభ, కుమార్, అనురాధ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి

కుషాయిగూడ: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేసి పాలకులు ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని సీపీఐ పార్టీ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కె. ధర్మేంద్ర అధ్యక్షతన ఈసీఐఎల్‌లోని నీలం సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన సీపీఐ ఉప్పల్ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో స్వాతంత్ర్యం సిద్ధించి 76 ఏళ్లవుతున్న నేటికి ఆర్థిక అసమానతలు ఉన్నాయన్నారు. నేటికి కూడు, గూడు, తిండి లేని పేదలుండటం పాలకుల అసమర్థతకు నిదర్శనమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో జాప్యం చేస్తుందని, అర్హులందరికీ న్యాయం చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్. శంకర్‌రావు, ఉప్పల్ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహ్మ, బషీర్, రాజేందర్, సత్యప్రసాద్, సతీష్‌కుమార్, కృపాకర్, జాన్, స్వామిదాస్, నర్సింగరావు, బిక్షపతి, సాయిలు, రజని, గిరిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్‌కు నిరసనగా ధర్నా



మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఆశావర్కర్లు

మల్కాజిగిరి: ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ.. చలో అసెంబ్లీ కార్యక్రమానికి బయలుదేరిన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఆశావర్కర్ల జిల్లా యూనియన్ నాయకురాలు హేమలత తదితరుల ముందస్తు అరెస్టులను నిరసిస్తూ మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ముందస్తు అరెస్టులకు పాల్పడటం సరికాదన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

హుండీ లెక్కింపు



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు దేవాదాయశాఖ పర్యవేక్షణాధికారి డి. రవికుమార్ పర్యవేక్షణలో జరిగింది. 57 రోజుల హుండీ లెక్కింపులో రూ. 3,01,083 ఆదాయం వచ్చిందని ఈవో రవీందర్‌రెడ్డి ప్రకటించారు. హుండీ లెక్కింపులో ప్రధాన అర్చకులు ముదుంబై వేంకట రమణాచార్యులు, అర్చకులు తులసీరమణాచార్యులు, క్లర్క్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్యాంటిన్ పనుల పరిశీలన

సాక్షి,సిటీబ్యూరో: మహిళా క్యాంటిన్ పనులను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికగుప్తా పరిశీలించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళ స్వయం సహాయక బృందాలతో ఏర్పాటు చేయనున్న మహిళా క్యాంటిన్‌లో కొనసాగుతున్న నిర్మాణ పనుల గురించి ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ క్యాంటిన్ల నిర్మాణానికి సంబంధించిన పలు సూచనలు చేయటంతో పాటు పాటించాల్సిన పరిశుభ్రత, రుచికరమైన ఆహారాన్ని అందించడం తదితర విషయాలను అదనపు కలెక్టర్ చర్చించారు. డీఆర్‌డీఏ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో మొదలైన జియోగ్రాఫికల్ ఇన్‌ఫర్మేషన్ సర్వే

మహా నగరంలోని ప్రతి ఇళ్లు జియో ట్యాగింగ్ పరిధిలోకి..

ఉప్పల్ : గ్రేటర్ హైదరాబాద్ నగరంలో జియోగ్రాఫికల్ ఇన్‌ఫర్మేషన్ సర్వే మొదలైంది. ఇక నుంచి నగరంలోని ప్రతి ఇళ్లు జియోట్యాగింగ్ పరిధిలోకి వెళ్లనుంది. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎల్‌బీనగర్ జోన్ పరిధి నుంచి ఉప్పల్, హయత్‌నగర్ సర్కిళ్ల నుంచి ప్రారంభించింది. ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు ఆధ్వర్యంలో వాణిజ్య ఆస్తుల క్షేత్ర స్థాయి సర్వే మంగళవారం ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఈ సర్వేతో సమగ్రమైన భవిష్యత్తు మ్యాప్‌ను తయారు చేయనుంది. స్మార్ట్ హైదరాబాద్ నిర్మాణంలో భాగంగా ఈ మ్యాప్‌ను తయారు చేయడానికి అధికారులు రంగంలోకి దిగారు.

- ఉప్పల్ సర్కిల్ పరిధిలో దాదాపుగా 49 వేల గృహ సముదాయాలు ఉన్నట్లు గుర్తించారు. గుర్తించనివి, అనధికార గృహ సముదాయాలు, వాణిజ్య సముదాయాలు అంతకు మించే ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఎలా పనిచేస్తుంది..

ఈ సర్వే ద్వారా ప్రతి ఇంటికి ఓ పార్సిల్ నంబర్‌ను కేటాయిస్తారు. దీని ఆధారంగా సదరు ఇంటికి సంబంధించిన పూర్తి వివరాలు పార్సిల్ నంబర్‌లో క్రోడీకరిస్తారు.

- పార్సిల్ నంబరే భవిష్యత్తులో కీలకం కానుంది. నేరాలు జరిగినప్పుడు సులభంగా ఆ ప్రాంతానికి చేరుకోవడానికి పార్సిల్ నంబర్ ఉపయోగపడుతుంది. దీని ఆధారంగా నేరుగా ఇంటికి చేరుకోవచ్చు.

ఉపయోగాలు..

- జీఐఎస్ సర్వే వల్ల ప్రాపర్టీ టాక్స్ హెచ్చు తగ్గులు సవరించుకునే అవకాశం లభిస్తుంది.
- ప్రభుత్వ ఆస్తులను పర్యవేక్షించవచ్చు. ప్రభుత్వ సంస్థలు, పార్కుల గుర్తింపు, పురాతన కట్టడాలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, పాఠశాలలను సైతం గుర్తించవచ్చు.
- ఈ సర్వే వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. మన నగరాన్ని మరింత స్మార్ట్‌గా తీర్చిదిద్దుకునే అవకాశం ఉంటుంది. దీనికోసం ప్రజలంతా భాగస్వాములవ్వాలి. ఇంటికొచ్చిన అధికారులతో సహకరించాలని కోరారు.

సర్వేలో చూపించాల్సిన డాక్యుమెంట్లు..

సర్వే సమయంలో గృహ యాజమానులు అధికారులకు చూపించాల్సిన డాక్యుమెంట్లు భవన నిర్మాణ అనుమతుల పత్రాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, తాజా అస్తిపన్ను చెల్లించిన రశీదు, నీటిబిల్లు, విద్యుత్ బిల్లు, ట్రేడ్ లైసెన్స్ నంబర్, ఇంటి యజమాని ఐడీ వివరాలను చూపించాలి.

– ఆంజనేయులు, ఉప్పల్ సర్కిల్ డీసీ

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

కాప్రా : ప్రభుత్వ భూముల కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని కాప్రా తహసీల్దార్ సుచరిత అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్ ఇందిరమ్మ చెరువు శిఖంను మట్టితో నింపుతూ.. ఆక్రమణలు చేస్తున్నారనే సమాచారంతో కాప్రా తహసీల్దార్ సుచరిత స్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణాలను సిబ్బందితో కూల్చివేయించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కొందరు కబ్జాదారులు ఆక్రమించి పేదలకు నోటరీలు చేసి లక్షల్లో అమ్ముతూ.. ప్రభుత్వ స్థలాలు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జవహర్‌నగర్‌లో ఇప్పటికే 20 మంది కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు.

రైతుల ఖాతాల్లోకి డబ్బులు..

- మేడ్చల్ జిల్లాలో 2,799 మంది రైతులకు రూ.15.56 కోట్లు
- రెండో విడతలో 789 మంది రైతులకు రుణమాఫీ రూ.6.15 కోట్లు

సాక్షి,సిటీబ్యూరో: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.50 లక్షల లోపు పంట రుణాలు ఉన్న 789 మంది రైతుల ఖాతాల్లో రెండో విడత రుణమాఫీ కింద మంగళవారం రూ.6.15 కోట్లు జమ చేసింది. రెండు విడతల్లో కలిపి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,799 మంది రైతులకు రుణమాఫీ కింద ప్రభుత్వం రూ.15.56 కోట్లను చెల్లించింది. ఇప్పటికే లక్షలోపు రుణాలున్న 2,010 మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.9.40 కోట్లు జమ చేసింది. వచ్చే నెలలో రూ.2 లక్షలలోపు రుణాలున్న వారికి మాఫీ చేస్తామని ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు సంబరాలు చేసుకున్నారు.